## ఓటు హక్కు అందరి బాధ్యత

- రామగుండం స్వీప్ నోడల్ అధికారి స్వరూపరాణి



అవగాహన కల్పిస్తున్న స్వీప్ నోడల్ అధికారి

కోల్‌సిటీ, నవంబర్ 11: ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధమని, దేశ పౌరులుగా ఓటు హక్కు మనందరి బాధ్యత అని రామగుండం స్వీప్ నోడల్ అధికారి స్వరూప రాణి అన్నారు. రామగుండం నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ అరుణ శ్రీ ఆదేశాల మేరకు శనివారం గోదావరిఖని ఎల్‌బీ నగర్, రమేశ్ నగర్, కాకతీయ నగర్, లెనిన్ నగర్, విద్యానగర్, ఇందిరా నగర్, సంజీవ్ నగర్, ద్వారకా నగర్, ఎన్టీఆర్ నగర్ ప్రాంతాల్లో ఓటరు అవగాహన ప్రచారం చేపట్టారు. కళాజాత బృందంతో ఆటపాటలతో ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడారు. ప్రతి పౌరుడి ప్రథమ హక్కు ఓటు, ఆ హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత, ఓటు హక్కును కోల్పోయినోళ్లకు ప్రశ్నించే హక్కు కూడా కోల్పోయినట్లే అని వివరించారు. ఓటు హక్కు వినియోగంతోనే సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం అవుతారని, సంక్షేమ పథకాలను సద్వినియోగ చేసుకోవాలన్నా, ఇతర పథకాలు అనుభవించాలన్నా, ఉపాధి అవకాశాలు పొందాలన్నా అందుకు కనీస అర్హత ఓటు వేయడమేనని చెప్పారు. ప్రజా తీర్పులో పారదర్శకత లభిస్తుందన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటును నిజాయితీగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా డీఎంసీ రజినీ, సీవోలు, జూనియర్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, ఆర్పీలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## తక్కువ ప్రీమియంతో రూ.10లక్షల ప్రమాద బీమా

- ఖని సబ్ డివిజన్ పోస్ట్ ఇన్‌స్పెక్టర్ ఎం శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

కోల్‌సిటీ, నవంబర్ 11: తపాలా శాఖలో తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాలు కలిగేలా కొత్త పథకాలు తీసుకవచ్చిందని గోదావరిఖని తపాల శాఖ సబ్ డివిజన్ పోస్ట్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు.అనారోగ్యం బారిన పడితే ఆరోగ్య బీమా కింద దవాఖాన ఖర్చులను చెల్లిస్తుందని, ప్రమాదం జరిగినప్పుడు వ్యక్తిగత బీమా అండగా ఉంటుందన్నారు. తపాల శాఖ ప్రమాద బీమాను గ్రూపు యాక్సిడెంట్ గార్డు పాలసీ పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఏడాదికి రూ.399 లేదా రూ.396 చెల్లిస్తే రూ.10లక్షల బీమా వర్తిస్తుందన్నారు. పోస్టల్ పేమెంట్ బ్యాంకు ద్వారా దీన్ని చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తక్కువ ప్రీమియంతో అనేక ప్రయోజనాలు కల్పించారన్నారు. 18 నుంచి 65 ఏళ్ల లోపు వారు ఈ బీమా పాలసీ తీసుకోవచ్చన్నారు. ప్రమాదంలో మరణించినా, శాశ్వత వైకల్యం కలిగినా అవయవం కోల్పోయినా పక్షవాతం వచ్చినా రూ.10లక్షలు చెల్లిస్తారని, ప్రమాదం జరిగి పాలసీ తీసుకున్న వ్యక్తి వైద్యం కోసం ఆస్పత్రిలో చేరితే ఐపీడీ కింద రూ.60వేలు, ఔట్ పేషెంట్‌కు రూ.30వేలు ఇస్తారని, ఇంకా పాలసీ తీసుకున్న వారికి ఇతర బెనిఫిట్స్ కూడా ఉన్నాయని, విద్య ప్రయోజనానికి గరిష్టంగా ఇద్దరు పిల్లలకు రుసుంలో 10 శాతం లేదా రూ.లక్షల వరకు ఎంచుకోవచ్చని, కుటుంబ ప్రయోజనాలకు రూ.25వేలు, అంత్యక్రియలకు రూ.5వేలు అందిస్తారన్నారు. గత ఏడాది ఈ ప్రీమియం చేసుకున్న వారు ఈ ఏడాది రెన్యువల్ చేసుకుంటే సరిపోతుందన్నారు.

# మురుగునీరు.. ఉపయోగపడేలా



## 11 ఏరియాల్లో విజయవంతంగా వ్యర్థాల శుద్ధి

- సింగరేణి వ్యాప్తంగా 22 ప్లాంట్లు
- శుద్ధిచేసిన నీరు పంటల సాగుకు తరలింపు
- వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ.. రైతులకు ఉచితంగా పంపిణీ
- త్వరలో భూపాలపల్లి ఏరియాలో మరో రెండు అధునాతన ప్లాంట్లు

**సింగరేణి.. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు** పర్యావరణ పరిరక్షణకూ అధిక ప్రాధాన్యమిస్తున్నది. వాతావరణ సమతుల్యం దెబ్బతినకుండా అనేక కార్యక్రమాలు చేపడుతున్నది. తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూనే.. నీటి శుద్ధిపైనా దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా కాలనీల్లోని మానవ వ్యర్థాలను శుద్ధిచేసి వివిధ అవసరాలకు ఉపయోగించేలా చర్యలు చేపట్టింది. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని కాలనీల సెప్టిక్ ట్యాంక్‌లతో పాటు, స్నానాలు, బట్టలు ఉతికేందుకు ఉపయోగించిన నీటిని శుభ్రం చేస్తున్నది. ఈ క్రమంలో ఏర్పడే వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగానూ రైతులకు ఉచితంగా అందిస్తున్నది. ఇప్పటికే 22 ఎస్టీపీ (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లు నిర్మించింది. కాగా, భూపాలపల్లిలోని రెండు కాలనీల్లో రూ.4 కోట్ల చొప్పున మొత్తం రూ.8 కోట్లతో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎస్టీపీలను ఏర్పాటుచేయనున్నది. **- రామవరం, నవంబర్ 11**



ఏరియేషన్ ట్యాంక్‌లో నీటి శుద్ధీకరణ

సింగరేణి వ్యాప్తంగా చాలా ఇండ్లలో ఇంకుడు గుంతలు లేకపోవడంతో ప్రజలు ఉపయోగించిన నీరు వృథాగా కాలువల ద్వారా వాగుల్లో చేరి, కలుషితమవుతున్నాయి. జీవరాసులకు ముప్పు వాటిల్లడమే కాకుండా తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తే అనర్థాలూ ఎదురవుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని సింగరేణి యాజమాన్యం.. కాలనీల్లోని సెప్టిక్ ట్యాంక్‌లతో పాటు, స్నానాలు, బట్టలు ఉతికేందుకు ఉపయోగించిన నీటిని శుద్ధి చేసి, బయటికి పంపిస్తున్నది. ఇందుకు సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో నీటి శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేసింది. ఇందులో అన్ని ఏరియాలు, దవాఖానలను కలుపుకొని 22 ఎస్టీపీ(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ల ద్వారా ప్రక్రియ చేస్తున్నది. గౌతంపూర్ కాలనీలో 2010లో రూ.1.31కోట్లతో 1.5 ఎంఎల్‌డీ (మిలియన్ ల్యాక్స్ లీటర్ పర్‌డే) ఎస్టీపీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడి ఎస్టీపీలో శుద్ధిచేసిన నీటిని బయటికి పంపిస్తున్నారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ ఎర్రగడ్డ, గౌతంపూర్ కాలనీ, మిలీనియం, సీ2, 22 క్వార్టర్స్‌లోని మురుగు నీటిని శుద్ధి చేస్తున్నారు. అనంతరం ఆ నీటిని కాలువల్లోకి వదులుతున్నారు. తద్వారా పర్యావరణ సమతుల్యం దెబ్బతినకుండా ఉపయోగపడుతున్నది. దీంతో వాగుల్లో ప్రవహించే నీటికి ముప్పు తొలిగిపోయింది. అలాగే ఇతర అవసరాలకు కూడా ఆ నీటిని ఉపయోగిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో వ్యవసాయానికి అపరిశుభ్రమైన నీరు వాడడంతో పంటల దిగుబడి తగ్గడమే కాకుండా పనులు చేసే వాళ్లు కూడా అనారోగ్యానికి గురయ్యేవారు. దీంతో వ్యవసాయం మందగించింది. ఎస్టీపీ నిర్మాణం వల్ల శుద్ధి చేసిన నీటిని బయటికి పంపడం వల్ల వ్యవసాయ సాగు పెరిగి రైతులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

### ఎస్టీపీ పనితీరు..

కాలనీల నుంచి వచ్చే మురుగు నీటిని(సెప్టిక్ ట్యాంక్‌తో పాటు, స్నానాలు, బట్టలు ఉతికేందుకు ఉపయోగించిన) ముందుగా రా వాటర్ సంపునకు తరలిస్తారు. ఈ నీటిని 7.5 హెచ్‌పీ మోటర్‌తో మురుగునీటిని ఏరియేషన్ ట్యాంకులోకి మళ్లిస్తారు. ఇక్కడ 15 హెచ్‌పీ సామర్థ్యం గల మోటర్‌తో నీటిని చిలుకుతారు. అనంతరం ఏరియేషన్ ట్యాంక్-2లోకి పంపించి, అక్కడా చిలుకుతారు. ఆ తర్వాత క్లారిఫైర్ ట్యాంక్‌కు మళ్లించి, నెమ్మదిగా చిలుకుతారు. తద్వారా నీరు పైకి రావడమే కాకుండా స్లెడ్జ్ (మలం) కిందకు పోతుంది. మలాన్ని స్లడ్జ్ టాంకుకు మల్లించి, శుద్ధి చేస్తారు. క్లారిఫైర్ ట్యాంకులో ఉన్న నీటిని ఇసుక పొందపర్చిన బెడ్ ట్యాంకులకు తరలిస్తారు. అక్కడ ఇసుకపై మలం పేరుకొని, ఇసుక నుంచి శుద్ధి చేసిన నీరు వస్తుంది. ఆ నీటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్యాంకులో నిల్వ చేస్తారు. ఇక్కడ ల్యాబ్‌లో 5 రకాల పరీక్షలు (పీహెచ్, టీఎస్ఎస్, టీడీఎస్, బీవోడీ, సీవోడీ) నిర్వహించి, వాటి ప్రమాణాలు సరిచూసుకొని బయట కాలువలోకి వదులుతారు.

### సేంద్రియ ఎరువుల కేంద్రంగా ఎస్టీపీ..

ఎస్టీపీలో ప్లాంటులోకి కాలనీ నుంచి వచ్చిన వ్యర్థాలను సేంద్రి ఎరువు ఏరియేషన్ ట్యాంక్, క్లారిఫైర్ ట్యాంకుల ద్వారా వచ్చిన వ్యర్థాలను బెండ్‌ట్యాంక్స్(ఇసుక)లోకి వదలడం వల్ల నీరు ఇసుక ద్వారా శుద్ధి అయి బయటికి వెళ్తుండి. బెట్ ట్యాంక్స్‌పై పేరుకుపోయిన స్లెడ్జ్‌ను ఎండిన తరువాత ఇసుపై నుంచి తొలగించి, పక్కన పోసాతరు. దీనిని సేంద్రియ ఎరువుగా ఉపయోగిస్తారు. ఈ ప్రాంతంలోని రైతులకు ఉచితంగా అందజేస్తారు. అలాగే ప్లాంటులో వివిధ పండ్లు, పూల రకాల మొక్కలకు ఎరువుగా వాడుతారు.



క్లారిఫై ట్యాంక్ నుంచి బెడ్ ర్యాక్స్‌పైకి వదులుతున్న నీరు



ల్యాబ్‌లో నీటి పరీక్షలు చేస్తున్న ఉద్యోగి

### నీటి శుద్ధి కేంద్రాల పరిధిలోని కాలనీలు..

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో నీటి శుద్ధి కార్మాగారాలు ఏర్పాటు చేసింది. కొత్తగూడెం కార్పొరేషన్ నీటి శుద్ధి కేంద్రానికి ఏరియా ప్రధాన దవాఖాన, ఏరియా క్వార్టర్ల నుంచి.., కొత్తగూడెం కేంద్రానికి గౌతమ్‌పూర్, రుద్రంపూర్ కాలనీల నుంచి.., మణుగూరు కేంద్రానికి పీవీ కాలనీ నుంచి.., ఇల్లెందులోని కేంద్రానికి ఓల్డ్ కాలనీ, పోస్టాఫీస్, జేకే కాలనీ,, సింగరేణి కాలనీ, చెక్‌పోస్టు ప్రాంతాల నుంచి.., ఆర్జీ-1లోని కేంద్రానికి ఓల్డ్ జీడీకే-3 ఇన్‌క్లైన్, జీడీకే-3 ఇన్‌క్లైన్, ఏరియా దవాఖాన నుంచి.., ఆర్జీ-2లోని కేంద్రానికి మహాకవి పోతన కాలనీ నుంచి.., ఆర్జీ-3లోని కేంద్రానికి సెంటినరీ కాలనీ నుంచి.., భూపాలపల్లిలోని కేంద్రానికి కృష్ణ కాలనీ, సుభాష్‌కాలనీ, ఏరియా దవాఖాన.., బెల్లంపల్లిలోని కేంద్రానికి గోలేటి టౌన్‌షిప్ నుంచి.., శ్రీరాంపూర్‌లోని కేంద్రానికి నస్పూర్ కాలనీ నుంచి.., మందమర్రిలోని కేంద్రానికి ఏరియా దవాఖాన (రామకృష్ణాపూర్), ప్రతిమ కాలనీ, నాగార్జున కాలనీల నుంచి.., ఎస్టీపీపీలోని కేంద్రానికి సోమగూడెం, తదితర కాలనీల నుంచి మురుగునీరు వస్తుంది.

### సాగుకు ఉపయోగపడుతుంది..



*గతంలో మురుగునీరు రావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పంట పనులు చేసేందుకు కూలీలు వచ్చేవారు కాదు. ఎస్టీపీ ఏర్పాటు తరువాత నీటిని శుద్ధిచేసి, పంటపొలాలకు వదులుతున్నారు. దీంతో గతంలో పడ్డ ఇబ్బందులు దూరమయ్యాయి. కాలువల ద్వారా వచ్చే నీటి కంటే శుద్ధిచేసిన నీరే ఎక్కువగా వస్తుంది. దీనికి ఏ రోజూ, ఏ సమయంలో నీటిని విడుదల చేస్తారో తెలియజేస్తే బాగుంటుంది. అలాగే పరీక్షా ప్రమాణాలను పూర్తిస్థాయిలో పాటిస్తే ఈ నీటిని పశువులకు తాగించేందుకు ఉపయోగపడుతుంది.*

**- మొగరం శివకుమార్, రైతు, రుద్రంపూర్**

### పర్యావరణ పరిరక్షణే ధ్యేయం..



*సంస్థ సీఎండీ శ్రీధర్, డైరెక్టర్ల ఆదేశాల మేరకు సంస్థ పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తుంది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యం దెబ్బతినకుండా అనేక కార్యక్రమాలు చేపడుతున్నది. అందులో భాగంగా కాలనీలోని మురుగునీటిని శుద్ధిచేసేందుకు 22 ఎస్టీపీ ప్లాంట్లను ఏర్పాటుచేసింది. అలాగే ఎస్టీపీల వల్ల ఉపాధి కూడా దొరుకుతుంది. భూపాలపల్లి ప్రాంతంలో రెండు కాలనీల్లో ఒక్కో ఎస్టీపీకి రూ.4 కోట్ల వ్యయంతో మొత్తం రూ.8 కోట్లతో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్టీపీలను ఏర్పాటుచేస్తున్నాం.*

**- టీ సూర్యనారాయణ, సివిల్ జనరల్ మేనేజర్**